క్లుప్తంగా

వరి పంట కోతల్లో రైతులు బిజీ



లక్ష్మీపురం గ్రామంలో వరి చేను కుప్పలు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి పంట కోత దశకు చేరుకోవడంతో చేను కోతల్లో రైతులు బిజీగా ఉన్నారు. గ్రామాల్లో వరి వెదలు, ముందుగా నారు పోసి నిర్దేశించిన గడువుగా ముందుగా వరినాట్లు వేసిన పెదంకలాం, లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస, దయానిధిపురం, బుడ్డిపేట, చిన బోగిలి, ఆర్.వెంకంపేట, గుచ్చిమి, అంటిపేట గ్రామాల్లో వరి చేను కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే సమయంలో ఆయా పొలాల్లో అపరాలు వేసేందుకు పొలాలను రైతులు సిద్ధం చేస్తున్నారు.

పంపిణీకి పెసలు, కట్టిజనుము విత్తనాలు



సిద్ధంగా ఉన్న విత్తనాలు

బలిజిపేట: మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద సబ్సిడీపై విక్రయించేందుకు పెసలు, కట్టిజనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఓ శ్రావణ్ తెలిపారు. పెసలు ఐపీఎం–2–14రకం 10 క్వింటాళ్లు, కట్టిజనుము విత్తనాలు 9.3క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు ఆర్బీకేల వద్ద తీసుకోవాలని సూచించారు. పెసలు కిలో రూ.117.50కాగా సబ్సిడీ పోను రైతు కట్టాల్సింది రూ.82.25లని తెలిపారు. కట్టి జనుము కిలో రూ.84కాగా రైతు రూ.42 చెల్లించి పొందవచ్చన్నారు. దీనిని రైతులు గమనించాలని సూచించారు. మిగిలిన విత్తనాలు త్వరలోనే వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ఎమ్మెల్యే జోగారావును సత్కరిస్తున్న మీడియా ప్రతినిధులు

పార్వతీపురం టౌన్: జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. కేబినెట్ నిర్ణయంపై స్థానిక జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేదని, జగనన్న ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇల్లు పట్టాలు మంజూరు చేయాలని నిర్ణయించి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వృద్ధురాలికి పింఛన్ అందజేత



విశాఖ ఆస్పత్రిలో నారాయణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు రమణమ్మ

సీతానగరం: విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మరడ నారాయణమ్మకు వలంటీరు రమణమ్మ శనివారం విశాఖపట్నం వెళ్లి పింఛన్ అందజేసారు. మండలంలోని చెల్లంనాయుడువలస గ్రామానికి చెందిన పింఛన్‌దారు మరడ నారాయణమ్మ అనారోగ్యానికి గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసి వలంటీరు కేజీహెచ్‌కు శనివారం వెళ్లి పింఛన్ అందజేశారు. రమణమ్మకు పింఛన్‌దారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివాసీ సమావేశం

సీతంపేట: ఏవైఎస్ సొసైటీ ఆధ్వర్యంలో అస్సాంలో ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, సోరా భాషా, లిపి పరిరక్షణపై సోరా సమావేశం జరిగినట్లు ఆ సంస్థ ప్రతినిధులు సవర చిన్నరాయుడు, వెంకటరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశంలో ఉన్న సోరా ప్రజలు సుమారు 5 వేల మంది ఈ సమావేశానికి హాజరైనట్లు వెల్లడించారు. ఒడిశా నుంచి రామ్‌ప్రసాద్ గోమాంగో పాల్గొన్నట్లు తెలిపారు.

‘రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే..’

విజయవంతం చేయండి



బలిజిపేట సచివాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని విజయనగరం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. బలిజిపేట సచివాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, అమలు పరిచిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇంకా ఏమైనా అభివృద్ధి చేయాల్సి ఉంటే ప్రజల నుంచి వివరాలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాల పరిధిలో సమాచారాన్ని ఫ్లెక్సీలుగా తయారు చేసి ఏర్పాటు చేయాలన్నారు. బలిజిపేటలో ఈ నెల 9న కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు మండల అధికారులు బలిజిపేట సచివాలయం వద్దకు హాజరై కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, బి.సత్యనారాయణమూర్తి, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, అధికారులు, పార్టీ నాయకులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి



ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని డోకిశీల, తాళ్లబురిడి, గోచెక్క, తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేసుకున్న పంట మొత్తం పూర్తిగా నీరు లేక ఎండిపోయిందన్నారు. ఈ ప్రాంతాల్లో వర్షాధారంతో వరినట్లు తప్ప కాలువ సౌకర్యం లేదని, అందుకు పార్వతీపురం మండలంలో 70శాతం వరినాట్లు పంట దశకు వచ్చి దెబ్బతిన్నాయన్నారు. ఇదే పరిస్థితి గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో కూడా నెలకొందన్నారు. ప్రభుత్వం ఈ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు.

రెండు విడతల్లో ప్రత్యేక ఓటరు నమోదు



ఓటరు నమోదు రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు, గ్రామాంతరం వెళ్లిన వారి ఓటు హక్కు తొలగింపు, సవరణ కార్యక్రమాన్ని అర్హులైన వారంతా వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. మండలంలోని 118, 119, 148 పోలింగ్ కేంద్రాలతో పాటు బూర్జ, గెడ్డలుప్పి, కృష్ణారాయపురం, తామరఖండి, చినబోగిలి పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు నెల 4, 5, 6 తేదీల్లోని, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి ఓటు హక్కు పొందడానికి అర్హులన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం నిర్దేశించిన పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ పి.చిట్టెమ్మ, వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన బచ్చల చిన్నబాబు కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పాలవలస విక్రాంత్ శనివారం అందించారు. చిన్నబాబు కుమారుడు శార్విక్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందారు. ఈ మేరకు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేపట్టిన ఖర్చు రూ.35 వేలు ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేశారు. ఈ చెక్కును ఆయన బాధితులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శాసుబిల్లి జనార్ధనరావు, పతివాడ మోహనరావు, బలగ నాయుడుబాబు,బచ్చల రాము పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

గుమ్మలక్ష్మీపురం: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంత్రి మండలి ఆమోదం తెలపడం పట్ల గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, బి.కుమారస్వామి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలుమార్లు గత ప్రభుత్వాలకు, అధికారులకు విన్నవించుకున్నప్పటికీ కార్యరూపం దాల్చలేదని, ఎట్టకేలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టుల కలను సాకారం చేసేలా ఇళ్ల స్థలాలు మంజూరుకు పూనుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో గౌరవఅధ్యక్షులు పి.కొండలరావు, ఉపాధ్యక్షుడు పాలక ప్రేమానంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటు హక్కు పొందాలి



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట పోలింగ్ కేంద్రంలో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాములమ్మ

గుమ్మలక్ష్మీపురం: అర్హులంతా ఓటు హక్కును పొందాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి ఓటు నమోదు, మార్పులు చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌ను తహసీల్దార్ పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం కూడా ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. అర్హులంతా దీన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

భామిని: జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదుచేసుకోవాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు, డీటీ నిమ్మల శేఖరం కోరారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఘనసర, భామిని, బాలేరు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్, డీటీ సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. ఓటు నమోదుపై బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ ఉంటుందని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారితో పాటు ఆర్ఐ ఎస్.రాంబాబు ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న సీనియర్ సైంటిస్ట్ సీతారాం

సీతంపేట: ప్రత్యామ్నాయ పంటలతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ సైంటిస్ట్ సీతారాం అన్నారు. స్థానిక పరిశోధనా స్థానంలో శనివారం రైతులకు శిక్షణ ఇచ్చారు. వరితో పాటు ఇతర పంటల్లో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు బి.శారద, ఐటీడీఏ పీఏఓ హరికృష్ణ, పార్వతీపురం, పాలకొండ, సాలూరు మండలాల సహాయ సంచాలకులు టి.వెంకటేశం, కె.రత్నకుమారి, మధుసూదనరావు, నిర్మల జ్యోతి, శాస్త్రవేత్తలు లక్ష్మీనారాయణ, పి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఓ నిజాయితీ



పాలకొండ రూరల్: ఎస్సై సమక్షంలో బాధితురాలికి నగదు, ఆభరణాలు అందిస్తున్న శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీపీఓ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసుకు తన నిజాయితీని చాటుకున్నాడు. వీపీ రాజుపేట కూడలి వద్ద తనకు ఒక బ్యాగు దొరకగా.. అందులో కొంత నగదు, బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించాడు. దాన్ని తీసుకువెళ్లి ఎస్సై బి.శివప్రసాద్‌కు అప్పగించాడు. దీనిపై విచారణ చేసిన పోలీసులు ఆ బ్యాగు అట్టలి గ్రామానికి చెందిన పాపమ్మకు చెందినదిగా గుర్తించారు. పాపమ్మ విజయవాడ నుంచి స్వగ్రామం వచ్చే క్రమంలో పాలకొండలో ఆటో ఎక్కింది. మార్గం మధ్యలో బ్యాగును పోగొట్టుకుంది. పోలీసులు ఆమెను స్టేషన్‌కు పిలిచి శ్రీనివాసరావు చేతులమీదుగా పోగొట్టుకున్న బ్యాగును అప్పగించారు. నిజాయితీగా వ్యవహరించిన సీపీఓను పోలీస్ అధికారులు అభినందించారు.

దొరికిన ఫోన్ అప్పగింత

జియ్యమ్మవలస: మండలంలోని వనజ గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ బీజేపురం బ్రిడ్జి వద్ద తనకు దొరికిన స్మార్ట్‌ఫోన్‌ను జియ్యమ్మవలస పోలీసులకు అందించి తన నిజాయితీని చాటుకున్నాడు. వీరఘట్టం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి చెందిన ఫోన్‌గా పోలీసులు గుర్తించారు. దొరికిన ఫోన్‌ను నిజాయితీగా అందించిన అశోక్‌ను పోలీసులు అభినందించారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు



జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన బోరును పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ మోహనరావు

గరుగుబిల్లి: జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గృహనిర్మాణశాఖ డీఈఈ పి.మోహనరావు అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ జగనన్న కాలనీలో బోర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ టి.ఎల్లంనాయుడు, ఏఈ వి.అఖిల్‌నాయుడు, తదితరులున్నారు.

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ

సీతంపేట: బోగస్ ఎస్టీ ధ్రువపత్రాలపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి శనివారం విచారణ చేపట్టారు. తన కార్యాలయంలో డీఏలీసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని పిలిచి విచారించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. కేసులకు సంబంధించిన వారి కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ ద్వారా తెప్పించాలన్నారు. రెండు కేసులను విచారణ చేశారు. సీఐడీ డీఎస్పీ భూపాల్, ఏపీఓ రోసిరెడ్డి, తహసీల్దార్ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ దేశ్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని గుజ్జి గ్రామంలో గ్రామదేవత ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యంలో పలు గ్రామాల్లో గ్రామదేవత ఆలయాల నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధులు మంజూరైనట్లు చెప్పారు. నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మెన్ హెచ్.మోహనరావు, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ కళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ, తదితరులు

సాలూరు: మండలంలోని పురోహితునివలస మోడల్ కాలేజ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్–19 పోటీలకు ఎంపికయ్యారని కళాశాల పీడీ రవి తెలిపారు.ఈ మేరకు విద్యార్థులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరం రాజీవ్ స్టేడియంలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ అండర్–19 సాఫ్ట్‌బాల్ విభాగంలో కళాశాలకు చెందిన అరవింద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. అలాగే స్టాండ్ బైగా తరుణ్ ఎంపికయ్యాడన్నారు. స్థానిక ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో కళాశాలకు చెందిన గణేష్, వరప్రసాద్, ఆదిత్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ అంజలీదేవి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ధాన్యం కొనుగోలుపై సాంకేతిక శిక్షణ



శిక్షణ ఇస్తున్న టీఏ రాజశేఖర్

బలిజిపేట: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సంబంధించి సాంకేతిక శిక్షణ సదస్సును బలిజిపేట ఆర్బీకేలో శనివారం నిర్వహించారు. ఏఓ శ్రావణ్ ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్ శిక్షణ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు ముఖ్యంగా తేమ 17శాతం, సేంద్రీయ వ్యర్థ పదార్థాలు 1శాతం, అసేంద్రీయ వ్యర్థ పదార్థాలు 1శాతం, దెబ్బతిన్న, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు పట్టిన ధాన్యం 5శాతం, పరిపక్వం కాని, కుచించుకుపోయిన, మెలి తిరిగిన ధాన్యం 3శాతం, తక్కువ శ్రేణి లేదా కేళీలు 6శాతం నాణ్యతా ప్రమాణాలు అవసరమని టెక్నికల్ అసిస్టెంట్ పి.రాజశేఖర్ తెలిపారు. సాధారణ రకం క్వింటా రూ.2,183, ఎ–గ్రేడ్ రకం క్వింటా రూ.2,203లుగా నిర్ణయించడం జరిగిందని ఆ ప్రకారం కొనుగోలు చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు షెడ్యూల్ ఇచ్చిన తరువాత రైతు తెచ్చిన ధాన్యాన్ని టెక్నికల్ అసిస్టెంట్ నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కేంద్రంలో జరుగుతున్న ప్రక్రియ ఎంట్రీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ సిబ్బంది సిహెచ్.కల్యాణ్, వనిత పాల్గొన్నారు.

నవీకరణ విధానాలకు అనుగుణంగా

వైద్య సిబ్బంది కార్యాచరణ



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: వ్యాధి నిరోధక టీకా కార్యక్రమంలో నవీకరణ విధానాలకు అనుగుణంగా వైద్య సిబ్బంది కార్యాచరణ చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం పట్టణంలోని 18వవార్డులో టీకా కార్యక్రమం, చర్చివీధి పట్టణ ఆరోగ్య కేంద్రం పీపీ యూనిట్‌లో వ్యాక్సిన్ నిల్వలు తనిఖీ చేశారు. చిన్నారులకు వైద్య సిబ్బంది టీకా వేస్తున్న తీరును టీకా రికార్డులను నిశితంగా పరిశీలించి ఏ మేరకు నిర్దేశించబడిన మార్గదర్శకాలు పాటిస్తున్నారో గమనించారు. టీకా వేసే ముందు వ్యాక్సిన్ వీవీఎమ్ స్థితి, కాలపరిమితి, పిల్లల ఆరోగ్య స్థితి తప్పక పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. అత్యవసర మందులు కిట్ తనిఖీ చేశారు. అర్హులందరూ టీకా కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. టీకాల ఆన్‌లైన్ విధానం యూవిన్ ఆర్‌సీహెచ్ పోర్టల్ పరిశీలించారు. వారి పరిధిలో ఉండే ఐదేళ్లలోపు పిల్లలందరినీ యూవిన్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన ఆరోగ్య కేంద్రం సందర్శించి అక్కడి ఓపీ నిర్వహణను రికార్డులో తనిఖీ చేసి నమోదు అవుతున్న వ్యాధులు, అందజేస్తున్న చికిత్సను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ ఎం.మనోజ్, సూపర్‌వైజర్ పుష్ప, జయగౌడ్ తదితరులు ఉన్నారు.

వైద్యారోగ్య శాఖ సేవలు అభినందనీయం



పెదంకలాం పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి మెమొంటోలు అందజేస్తున్న జమ్మాన

సీతానగరం: వైద్యారోగ్య శాఖ అధికార సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. పెదంకలాం, సీతానగరం పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాల్లో సేవలందించిన వైద్యాధికారులకు, సిబ్బందికి శనివారం జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గ్రామాల్లో వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు. ఇతర శాఖల అధికార సిబ్బందినీ గౌరవించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెదంకలాం, సీతానగరం పీహెచ్‌సీల డాక్టర్లు రాధాకాంత్, ఉషారాణి, శిరీషా, పెదంకలాం సర్పంచ్ బి.శ్రీనివాసరావు, నిడగల్లు మాజీ సర్పంచ్ జి.వెంకటనాయుడు, పెదబోగిలి ఉప సర్పంచ్ అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీఈఓ లిల్లీరాణి

సీతంపేట: స్థానిక గిరిజన బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో 10 మంది పేనల్ టీం ఇన్‌స్పెక్షన్ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్లు, బోధనతీరు, టీచింగ్ డైరీ వంటివి పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.